## Key Area 7 : Leading school administration

# ప్రధాన రంగం : పాఠశాల నిర్వహణ నేతృత్వం

**మాడ్యూల్ పేరు** : పాఠశాల ప్రమాణాలు (School Standards)

**యూనిట్-1** : పాఠశాల ప్రమాణాలు అంటే ఏమిటి? అవి ఏవి?

**యూనిట్-2** : పాఠశాల ప్రమాణాలను ఎలా సాధించాలి?

**రచయిత** : శ్రీ M. రామాంజనేయులు,

ఉపన్యాసకుడు (Retd.), డైట్ వికారాబాద్,

కన్సల్‌టెంట్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,

హైదరాబాదు.

# పాఠశాల ప్రమాణాలు

## యూనిట్–1

### 1.1 శీర్షిక : పాఠశాల ప్రమాణాలు అంటే ఏమిటి? అవి ఏవి?

### 1.2 అభ్యసన లక్ష్యాలు

1) పాఠశాల ప్రమాణాల ఆవశ్యకతను గుర్తించడం.

2) జవాబుదారీ తనాన్ని పెంపొందించడం.

3) పాఠశాల ప్రమాణాలు అంటే ఏమిటో తెలుసుకోవడం.

4) పాఠశాల ప్రమాణాల గురించి తెలుసుకోవడం.

### 1.3 కీలక పదాలు

| | |
|---|---|
| పాఠశాల ప్రమాణాలు | ప్రధానక్షేత్రం |
| ప్రణాళికా రచన | కీలక ప్రమాణాలు |
| జవాబుదారీ తనం | వృత్తిపర అభివృద్ధి |
| మూల్యాంకనం | పాఠశాల నాయకత్వం |
| బోధనాభ్యసన ప్రక్రియు | సమ్మిళిత విద్య |
| వనరులు | సమాజ భాగస్వామ్యం |
| విద్యార్థుల ప్రగతి | వ్యక్తిత్వ వికాసం |
| సర్వతోముఖాభివృద్ధి | ఎస్.ఎమ్.సి. (SMC) / ఎస్ఎమ్.డి.సి. (SMDC) |

### 1.4 పరిచయం

ఏదేశ భవిష్యత్తైనా ఆదేశ విద్యావ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా పాఠశాల విద్య ఉన్నత విద్యకు పునాది లాంటిది. అందువల్ల నాణ్యమైన పాఠశాల విద్యను పిల్లలకు అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది. నాణ్యమైన విద్య అందించాలంటే పాఠశాల ప్రభావవంతంగా పనిచేస్తూ, అభివృద్ధి పథంలో పయనించాలి. మరి పాఠశాల ఎంతమేరకు అభివృద్ధి సాధించింది అనే విషయాన్ని తెలుసుకోవాలన్నా, ఒక ప్రాంతం లేదా జిల్లాలోని పాఠశాల స్థాయిని పోల్చుకోవాలన్నా కొన్ని ప్రమాణాలను ఏర్పర్చుకొని మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. అందుకు పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయుడు తన పాఠశాల ప్రమాణాలు నిర్దేశించుకొని మూల్యాంకనం

చేసుకోవలసి ఉంటుంది. ఇందుమూలంగా వివిధ స్థాయిలో అంటే పాఠశాల స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు పాఠశాల ప్రమాణాల ఆవశ్యకత ఎంతో ఉంది

ఈ సెక్షన్‌లో పాఠశాల ప్రమాణాలు అంటే ఏమిటి? వాటి ఆవశ్యకతను మరియు ఆ ప్రమాణాల గురించి తెలుసుకుందాం.

## 1.5 పాఠశాల ప్రమాణాలు

పాఠశాల ప్రమాణాలను క్రింది విధంగా నిర్వచించవచ్చు.

### 1.5.1 నిర్వచనం

పాఠశాలను ఒక వ్యవస్థగా దాని అభివృద్ధిని సమగ్రంగా, సంపూర్ణంగా మూల్యాంకనం చేయడానికి తద్వారా జవాబుదారీ తనాన్ని పెంపొందించడానికి ఉపయోగించే సాంకేతిక సాధనాలే పాఠశాల ప్రమాణాలు.

### 1.5.2 ఆవశ్యకత

పాఠశాల ప్రమాణాలతో

- పాఠశాల నిరంతర అభివృద్ధిని స్వీయమూల్యాంకనం చేసుకోవచ్చు.
- పాఠశాల విద్యా వ్యవస్థలోని భాగస్వాములందరిలో జవాబుదారీ తనాన్ని పెంపొందించవచ్చు.
- పాఠశాల సిబ్బంది సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా వారిని మానవ వనరుల సమూహంగా రూపొందించవచ్చు.
- మూల్యాంకన నివేదికను విశ్లేషించి పాఠశాల అభివృద్ధికి ప్రణాళికా రచన చేయవచ్చు.
- అభ్యాసకులు కేంద్రంగా, అంచెలంచెలుగా పాఠశాలను అభివృద్ధి చేసుకోవచ్చు.

### 1.5.3 పాఠశాల ప్రమాణాలు

కేంద్ర విద్యాశాఖ ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NIEPA) ఆధ్వర్యంలో జాతీయ మూల్యాంకన కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టి పాఠశాల ప్రమాణాలను ఏడు ప్రధాన క్షేత్రాలుగా విభజించి ప్రతి క్షేత్రంలో కీలక ప్రమాణాలను క్రింది విధంగా నిర్ణయించింది.

**ప్రధానక్షేత్రం-1 : పాఠశాల వనరుల సౌలభ్యత అందుబాటు, తగు పరిమాణం, వినియోగం :**

వనరులు అనగా భౌతిక వనరులు, మానవ వనరులు, ఆర్థిక వనరులు వస్తుసామాగ్రి మొదలైనవి. పాఠశాలలో వనరులన్నీ తగిన పరిమాణంలో అందుబాటులో ఉంటే బోధనాభ్యసనలో వాటి వినియోగం జరుగుతుంది. అప్పుడే నాణ్యమైన విద్యను పిల్లలకు అందించడం ద్వారా పాఠశాల ప్రభావవంతంగా పనిచేయగలదు. ఉపాధ్యాయులు కూడా ఎలాంటి వత్తిడి లేకుండా బోధనలో లీనమౌతారు.

**కీలక ప్రమాణాలు :**

- పాఠశాల ఆవరణ
- ఆటస్థలం, క్రీడా సామగ్రి / పరికరాలు
- తరగతి గదులు మరియు ఇతర గదులు
- విద్యుత్తు మరియు ఎలక్ట్రానిక్ పరికరాలు
- గ్రంథాలయం
- ప్రయోగశాల
- కంప్యూటర్
- ర్యాంపు
- మధ్యాహ్నభోజనం వంట గది, వంట పాత్రలు
- త్రాగునీరు
- చేతులు శుభ్రం చేసుకొను సదుపాయం
- మరుగుదొడ్లు

**ప్రధానక్షేత్రం–2 : బోధనాభ్యసన మరియు మదింపు**

అభ్యసన లక్ష్యాలను సాధించుటకు ఇది అతి ముఖ్యమైనది. ఉపాధ్యాయుడు పిల్లల నేపథ్యాన్ని, వారి అవసరాలను అర్థం చేసుకొని వ్యూహాత్మకంగా బోధనా ప్రణాళికను రూపొందించుకోవాలి. తగిన బోధనా వ్యూహాన్ని, పరికరాలనుపయోగించి బోధించడమేకాక ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తరగతి గదిలో కల్పించుకోవాలి. విద్యార్థులు తరగతిలో నేర్చుకున్న అంశాలను తమ నిజజీవిత సందర్భాలలో వినియోగించే విధంగా ప్రక్రియలను / కృత్యాలను నిర్వహించాలి. తాను అనుకున్న లక్ష్యాలను ఎంతమేర సాధించాడో తెలుసుకోవడానికి నిరంతరంగా మదింపు చేస్తూ ఉండాలి. ఉపాధ్యాయుడు తన స్వీయ ప్రగతి స్పందనను నమోదు చేసుకుంటూ తగిన విధంగా ప్రణాళికను రూపొందించుకొని అమలుచేయాలి.

**కీలక ప్రమాణాలు :**

- విద్యార్థులపై ఉపాధ్యాయుల అవగాహన
- విషయ మరియు బోధనావిధానాలపై ఉపాధ్యాయుల పరిజ్ఞానము
- బోధనా ప్రణాళిక
- అభ్యసన వాతావరణ సౌలభ్యత

- బోధనాభ్యసన విధానం
- తరగతి నిర్వహణ
- విద్యార్థుల మదింపు
- బోధనాభ్యసన వనరుల వినియోగం
- ఉపాధ్యాయుల బోధనాభ్యసన ప్రక్రియలపై స్వీయ ప్రతిస్పందను.

**ప్రధానక్షేత్రం–3 : విద్యార్థుల ప్రగతి, సాధన, అభివృద్ధి**

జ్ఞానాత్మక, భావావేశ, మానసిక చలనాత్మక రంగాలలో విద్యార్థులు ప్రగతి సాధిస్తేనే వారి వ్యక్తిత్వ వికాసం జరుగుతుంది. పాఠశాలలో జరిగే పాఠ్య, సహపాఠ్య మరియు ఇతర కార్యక్రమాలు విద్యార్థుల ఆసక్తులకనుగుణంగా ఉంటేనే వారి హాజరు మెరుగౌతుంది, మానసిక మరియు సాంఘికాభివృద్ధి జరుగుతుంది.

**కీలక ప్రమాణాలు :**

- విద్యార్థుల హాజరు
- విద్యార్థుల భాగస్వామ్యం మరియు పాల్గొనడం
- విద్యార్థుల ప్రగతి
- విద్యార్థుల వ్యక్తిగత మరియు సాంఘికాభివృద్ధి
- విద్యార్థుల సాధన

**ప్రధానక్షేత్రం–4 : ఉపాధ్యాయుల పనితీరు మరియు వృత్తిపర అభివృద్ధి నిర్వహణ**

విద్యాప్రమాణాళికలో వస్తున్న మార్పులకనుగుణంగా ఉపాధ్యాయులు తమ వృత్తిపరంగా నైపుణ్యాలను పెంచుకోవలసిన అవసరమున్నది. నూతనంగా వృత్తిలోచేరిన వారికి కూడా ప్రస్తుత వ్యవస్థలో ఉన్న అంశాలను వృత్యంతర శిక్షణ ద్వారా అందించాలి. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను అప్పగించడం తగ్గించి బోధనకే వారి సేవలు తీసుకునే విధంగా చూడవలసిన అవసరమున్నది. నిరంతర పర్యవేక్షణతోనే ఉపాధ్యాయుల పనితీరును, వృత్తిపర అభివృద్ధిని మెరుగుపర్చవచ్చు.

**కీలక ప్రమాణాలు :**

- నూతన ఉపాధ్యాయులకు మరియు పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ
- ఉపాధ్యాయుల హాజరు
- బాధ్యతలను అప్పగించడం మరియు పనితీరు లక్ష్యాలను నిర్దేశించడం
- మారుతున్న విద్యాప్రణాళికకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంసిద్ధత

- ఉపాధ్యాయుల పనితీరుపై పర్యవేక్షణ
- ఉపాధ్యాయుల వృత్తిపర అభివృద్ధి

**ప్రధానక్షేత్రం–5 : పాఠశాల నాయకత్వం మరియు నిర్వహణ**

పాఠశాల ప్రమాణాల సాధన సమర్థవంతమైన, స్ఫూర్తిదాయకమైన నాయకత్వం, నిర్వహణ మీద ఆధారపడి ఉంటుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రణాళికారచన చేయాలి. పాఠశాల భాగస్వాములందరితో సత్సంబంధాలు నెలకొల్పుకొని ప్రణాళికా రచనలో, నిర్ణయాలు తీసుకోవడంలో, సాధారణ పరిపానలో వారిని పాలుపంచుకునేట్లు చూడాలి. వనరుల సేకరణ, వినియోగం, పాఠశాలలో జరిగే కార్యక్రమాలు, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సమాజ భాగస్వామ్యంపై దిశానిర్దేశం చేస్తూ, నాయకత్వం వహించాలి. బలమైన, సమర్థవంతమైన, అంకితభావంగల నాయకత్వంతోనే పాఠశాల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది.

**కీలక ప్రమాణాలు :**

- సరియైన దృక్పథాన్ని పెంపొందించుకొని దిశానిర్దేశం చేయడం
- మార్పుకీ, అభివృద్ధికి నాయకత్వం వహించడం
- బోధనాభ్యసనానికి నాయకత్వం వహించడం
- పాఠశాల నిర్వహణకి నాయకత్వం వహించడం

**ప్రధానక్షేత్రం–6 : సమ్మిళిత విద్య, ఆరోగ్యం మరియు భద్రత**

లింగ, కుల, మత, ఆర్థిక, సామాజిక, భాష, భౌతిక భేదాలకు అతీతంగా అందరికీ సమాన విద్యను అందించడం, సమాన అవకాశాలు కల్పించడమే సమ్మిళితం. భిన్న నేపథ్యాలుగల పిల్లలందర్నీ పాఠశాలలోనికి ప్రవేశం కల్పిస్తే, వారందరూ విద్యను నేర్చుకోగలుగుతారు. పాఠశాలలో చేరిన పిల్లలందరికీ భౌతిక, మానసిక భద్రతను, ఆరోగ్యం మరియు పరిశుభ్రతను అందించాలి. అందుకు పాఠశాలలో సమగ్ర పర్యవేక్షణ వాతావరణం కల్పించబడాలి.

**కీలక ప్రమాణాలు :**

- సమ్మిళిత సంస్కృతి
- ప్రత్యేక అవసరాలుగల పిల్లల (సి.డబ్ల్యు.ఎస్.ఎన్.) విలీనత
- భౌతికపరమైన భద్రత
- మానసిక భద్రత
- ఆరోగ్యం మరియు పరిశుభ్రత

**ప్రధానక్షేత్రం–7 : ఉపయుక్తమైన సమాజ భాగస్వామ్యం**

సమాజం అనగా పాఠశాల యాజమాన్యకమిటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు, అనుబంధ మరియు స్వచ్ఛంద సంస్థలు. పాఠశాల అభివృద్ధిలో సమాజ పాత్ర చాలా కీలకమైనది. పిల్లలకు నాణ్యమైన విద్యనందించడం, అవసరమైన వనరులను సేకరించడం వాటిని వినియోగించడంలో సమాజ సహకారాన్నిపొందవలెను. కాబట్టి పాఠశాల సమాజంతో సత్సంబంధాన్ని కలిగి ఉంటే అందరికీ ఎంతో ఉపయోగం. అందుకే ఎస్.ఎమ్.సి. / ఎస్.ఎమ్.డి.సి. లను ఏర్పాటుచేయడం జరిగింది. పాఠశాల ప్రణాళిక రూపకల్పన, అమలు, వనరుల సేకరణ, పర్యవేక్షణ, పిల్లల నమోదు, నిలకడ, బోధనాభ్యసన ప్రక్రియలు, అభ్యసన ఫలితాలు మొదలైనవాటి మెరుగుదలలో వీటిపాత్ర కీలకం.

**కీలక ప్రమాణాలు :**

- ఎస్.ఎమ్.సి. / ఎస్.ఎమ్.డి.సి. ల ఏర్పాటు, నిర్వహణ
- పాఠశాల అభివృద్ధిలో పాత్ర
- పాఠశాల – సమాజ సంబంధాలు
- అభ్యసన వనరుగా సమాజం
- సమాజాన్ని సాధికారికం చేయడం

## 1.6 ఆచరణాత్మక అభ్యాసము

**కృత్యం–1 :** మీ పాఠశాలను అందరి భాగస్వాముల ఆకాంక్షలను ప్రతిబింబిచే విధంగా మీరు ఏఏ రంగాలలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పాలని భావిస్తున్నారు?

**కృత్యం–2 :** ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NIEPA) సూచించిన ఏడు రంగాల కీలక ప్రమాణాలను మీరు ఒకసారి పునఃసమీక్షించుకొని, మీ పాఠశాలను దృష్టిలోనుంచుకొని, కృత్యం–1 లో మీరనుకున్న ప్రమాణాలలో అవసరమైన మార్పులను తెచ్చుటకు మీ సిబ్బందితో చర్చించి, వాటి అమలుకు ఒక కార్యాచరణ ప్రణాళికను, నిర్దిష్టకాల పరిమితిని సూచిస్తూ రూపొందించండి.

| క్ర.సం. | నిర్దేశించుకున్న ప్రమాణం | కాలపరిమితి |
|---|---|---|
| | | |

## 1.7 ముగింపు

కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ, ఎన్.ఐ.ఇ.పి.ఎ. ఆధ్వర్యంలో జాతీయ మూల్యాంకన కార్యక్రమం (ఎన్.పి.ఎస్.ఎస్.ఇ.) దేశవ్యాప్తంగా చేపట్టి ''పాఠశాల ప్రమాణాల''ను ప్రతి పాఠశాలలో మూల్యాంకనం చేయడం ద్వారా పాఠశాల అభివృద్ధిని అంచనావేయాలని చెప్పింది. మూల్యాంకన నివేదికలను విశ్లేషించి పాఠశాల అభివృద్ధి

ప్రణాళికను భాగస్వాములందరి సహకారంతో తయారుచేసి, అమలుపరిస్తే ఆ పాఠశాల అంచెలంచెలుగా అభివృద్ధిని సాధించగలదు. అలాగే భాగస్వాములందరిలో జవాబుదారీతనం పెంపొంది పిల్లలందరికీ నాణ్యమైన, ప్రమాణాలతో కూడిన విద్య భద్రతతోపాటు అందుతుంది.

# యూనిట్-2

## 2.1 శీర్షిక : పాఠశాల ప్రమాణాలను ఎలా సాధించాలి?

## 2.2 అభ్యసన లక్ష్యాలు

1) పాఠశాల మూల్యాంకనాన్ని ఎలా చేయాలో తెలుసుకోవడం.
2) పాఠశాల స్వీయమూల్యాంకనం చేయడం.
3) మూల్యాంకన నివేదికలను విశ్లేషించి భాగస్వాములందరి సహకారంతో పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారుచేయడం.
4) పాఠశాల అభివృద్ధి ప్రణాళికను అమలుపర్చడం ద్వారా సుస్థిర, నిరంతర అభివృద్ధిని సాధించడం.

## 2.3 కీలక పదాలు

- పాఠశాల మూల్యాంకనం — వాస్తవ సమాచారం
- మూల్యాంకన నివేదిక — వివరణ సూచిక
- పాఠశాల అభివృద్ధి ప్రణాళిక — సాక్ష్యాధారాలు
- స్పందనాత్మక ప్రశ్నలు — ప్రతిస్పందన మాత్రిక

## 2.4 పరిచయం

పాఠశాల ప్రమాణాలను ఏర్పర్చుకోవడం యొక్క ముఖ్య ఉద్దేశ్యం పాఠశాల యొక్క సుస్థిర, నిరంతర అభివృద్ధిని సాధించడమే. పాఠశాల ప్రమాణాలను సాధిస్తేనే ఇది సాధ్యమౌతుంది. అందుకు పాఠశాల యొక్క ప్రస్తుత స్థాయిని అంచనా వేసుకోవాలంటే ప్రతి పాఠశాల ప్రమాణాన్ని స్వీయ మూల్యాంకనం చేసుకోవాల్సిందే. మూల్యాంకన నివేదికను విశ్లేషించుకొని భాగస్వాములందరి సహకారంతో పాఠశాల ప్రమాణాలను పెంచుకోడానికి తగిన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకొని అమలుపరచాల్సి ఉంటుంది.

ఈ సెక్షన్‌లో పాఠశాల ప్రమాణాలను సాధించడానికి అవసరమైన మూల్యాంకనం గురించి తద్వారా పాఠశాల అభివృద్ధిని ఎలా సాధించాలో తెలుసుకుందాం.

## 2.5 పాఠశాల ప్రమాణాలను ఎలా సాధించాలి?

ప్రస్తుతం మన పాఠశాల స్థాయి ఎలా ఉందో తెలుసుకుంటేనే పాఠశాల అభివృద్ధికి తగిన ప్రణాళికను తయారుచేసుకోగలం. అందుకు మొదటగా పాఠశాల ప్రమాణాలను మూల్యాంకనం చేయాలి.

### 2.5.1 పాఠశాల మూల్యాంకనం

ఇది రెండు రకాలు : 1) స్వీయ మూల్యాకనం, 2) బాహ్య మూల్యాంకనం

1) **స్వీయ మూల్యాకనం** : ఇది పాఠశాల అభివృద్ధికి తోడ్పడే ప్రాధాన్యతగల అంశాలను గుర్తించడానికి భాగస్వాములకు తోడ్పడుతుంది. ఇది నిరంతరంగా పాఠశాలలో స్వయంగా చేయ వలసిన ఒక చక్రియ ప్రక్రియ. విద్యాసంవత్సరమంతా చేపట్టి చివరలో పూర్తిచేయాలి. దీనిలో ఎస్.ఎమ్.సి. / ఎస్.ఎమ్.డి.సి. లతో పాటు పాఠశాల భాగస్వాములందరూ పాల్గొనాల్సి ఉంటుంది. ఇది పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించడానికి తోడ్పడుతుంది.

2) **బాహ్య మూల్యాకనం** : ఇది పాఠశాల అభివృద్ధిని పూర్తి స్థాయిలో సాధించడానికి స్వీయమూల్యాంకనానికి తోడుగా సహకరిస్తుంది. పాఠశాలకు చెందని ఇతర విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఇతర శాఖ అధికారులు దీనిని నిర్వహిస్తారు. వీరు స్వీయమూల్యాంకన పత్రాలను విశ్లేషించి, సమీక్షించి, పాఠశాల భాగస్వాముల నుండి అదనపు సమాచారాన్ని సేకరించి మూల్యాంకనం చేస్తారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రధాన అంశాలను సూచిస్తారు. దీనిని సంవత్సరంలో రెండుసార్లు నిర్వహిస్తారు.

పాఠశాల ప్రమాణాలను సాధించుకోవాలంటే స్వీయ మూల్యాంకనం అత్యవసరం. స్వీయమూల్యాంకనం వల్ల మన పాఠశాల పనితీరును ఎప్పటికప్పుడు అంచనావేసుకొని సరియైన దిశలో వెళ్ళడానికి అవకాశం ఉంటుంది. బాహ్య మూల్యాంకనం కూడా స్వీయ మూల్యాంకనం నిర్వహించే పద్ధతిలోనే నిర్వహిస్తారు. అందువల్ల స్వీయ మూల్యాంకనం నిర్వహించే విధానం గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### 2.5.2 స్వీయ మూల్యాంకనం నిర్వహించుకునే విధానం

ఇంతకు ముందు సెక్షన్‌లో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ మరియు ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NIEPA) ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ మూల్యాంకన కార్యక్రమంలో భాగంగా నిర్ణయించినటువంటి పాఠశాల ప్రమాణాలను ఏడు ప్రధాన క్షేత్రాలుగా విభజించారని తెలుసుకున్నాం. అయితే పాఠశాలను స్వీయ మూల్యాంకనం చేసుకోవాంటే ప్రతి ప్రధాన క్షేత్రాన్ని కూడా మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ప్రతి ప్రధాన క్షేత్రం యొక్క మూల్యాంకనం ఒక క్రమ పద్ధతిలో ఉంటుంది. దీనిలోని సోపానాలు క్రింది విధంగా ఉంటాయి.

1) **స్పందనాత్మక ప్రశ్నలు** : ఇవి, ప్రతి ప్రధాన క్షేత్రానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై రూపొందించిన ప్రశ్నలు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయు మరియు ఇతర భాగస్వాములందరూ కలిసి సమిష్టిగా చర్చించుకొని ఈ ప్రశ్నలకు జవాబులు రాసుకోవాలి. తద్వారా ఆ ప్రధాన క్షేత్రం యొక్క స్వీయ మూల్యాంకనంపై అవగాహన పొందవచ్చు.

ఉదాహరణకి ప్రధాన క్షేత్రం–1 కి సంబంధించిన స్పందనాత్మక ప్రశ్నలు :

1) పాఠశాలకు అవసరమైన వనరులు అందుబాటులో ఉన్నాయా? అవి తగిన మోతాదులో ఉన్నాయా?

2) పాఠశాలలో అందుబాటులో ఉన్న వనరుల నాణ్యత ఎలా ఉంది? వాటి ఉపయోగం ఏమేరకు ఉంది?

3) సైబర్ భద్రత కొరకు పాఠశాలలో ఎలాంటి పద్ధతులు అనుకరిస్తున్నారు?

2) **వాస్తవ సమాచారం** : ఇవి, ఒక ప్రధానక్షేత్రానికి సంబంధించిన వాస్తవ స్థితిగతులను సమాచార రూపంలో సేకరించడానికి ఉపయోగపడే ప్రశ్నలు. ఇవి సాంఖ్యక దత్తాంశ రూపంలోగాని, సంక్షిప్త సమాధాన రూపంలోగాని ఉంటాయి. ఇలా సేకరించే సమాచారం ఇతర కీలక ప్రమాణాల ద్వారా లభ్యం కాకపోవచ్చు. అందువల్ల ఇది మూల్యాంకనానికి పరిపుష్ఠినిస్తుంది. ఈ ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి పాఠశాలలో ఉన్న సమాచారాన్ని గాని, గతంలో ఇతరత్రా సేకరించిన సమాచారాన్ని గాని ఉపయోగించుకోవచ్చు. కీలక ప్రమాణాల వివరణ సూచికలలో పాఠశాల యొక్క స్థానాన్ని గుర్తించడానికి ఈ సమాచారం స్వీయ మూల్యాంకనమే కాకుండా బాహ్య మూల్యాంకనంలో కూడా ఉపయోగపడుతుంది.

ఉదాహరణకి ప్రధాన క్షేత్రం–2 కి సంబంధించిన వాస్తవ సమాచారం సేకరించడానికి ఉపయోగపడే ప్రశ్నలు :

1) విద్యార్థుల సామాజిక – సాంస్కృతిక మరియు ఇంటి నేపథ్యాలను ఎలా సేకరిస్తారు?

ఎ) పాఠశాల రికార్డులు ☐

బి) తల్లిదండ్రులతో మాట్లాడడం ద్వారా ☐

సి) స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకోవడం ☐

డి) ఇతరములు (రాయండి) ______________________

2) ఉపాధ్యాయులకు అందుబాటులోనున్న వివిధ రకాల బోధనాభ్యసన వనరులు.

ఎ) వనరుల గురించి తెలుపక పోవడం ☐

బి) వనరుల గురించి తెలిసినా అవి అందుబాటులో లేకపోవడం ☐

సి) వనరులు అందుబాటులో ఉండి ఉపయోగించేవి ______________

3) విద్యార్థుల వైఖరులు, అభిరుచుల ప్రేరణను ఉపాధ్యాయులు ఏవిధంగా మదింపు చేస్తారు?

ఎ) పాఠ్య మరియు సహ పాఠ్యాంశాలలో విద్యార్థుల సాధన స్థాయి ద్వారా ☐

బి) తరగతి గదిలో విద్యార్థులతో స్వయంగా మాట్లాడడం ద్వారా ☐

సి) ఇతర ఉపాధ్యాయులతో చర్చించడం ద్వారా ☐

డి) తరగతి గదిలో మరియు బయట విద్యార్థుల ప్రవర్తనను పరిశీలించడం ద్వారా ☐

ఇ) మదింపు చేయలేకపోవడం ☐

3) **కీలక ప్రమాణాలు :** ప్రతి ప్రధానక్షేత్రానికి సంబంధించిన ముఖ్య పార్శ్వాలను స్పృశించే అంశాలే ఆ క్షేత్రంలోని కీలక ప్రమాణాలు. ఇవి నాణ్యత యొక్క స్థాయిని కొలిచి అంచనా వేసే ప్రమాణాలను ప్రతిపాదిస్తాయి. పాఠశాల మూల్యాంకనానికి ఈ కీలక ప్రమాణాలే మూలాధారంగా ఉంటాయి. ఇవి పాఠశాల యొక్క ఆశించదగిన పనితీరును మూడు స్థాయిలలో (స్థాయి-1, స్థాయి-2, స్థాయి-3) క్రమంగా ఏ విధంగా ఉండాలో నిర్ధారిస్తాయి.

4) **కీలక ప్రమాణాల వివరణ సూచికలు :** కీలక ప్రమాణాల యొక్క ప్రతి స్థాయిలోని సాధనను నిర్వహించే సంపూర్ణ వాక్యాలే వివరణ సూచికలు. ఇవి ప్రతి కీలక ప్రమాణం యొక్క ఆయాస్థాయిల పరిధిని తెలుపుతాయి. ఈ వివరణ సూచికలు స్వభావరీత్యా సూచనాత్మకంగా ఉండి కీలక ప్రమాణాల సంతుష్టికి వివిధ స్థాయిలో దోహదపడాతాయి. ఇవి మూడు స్థాయిలలో క్రమానుగతంగా వ్రాయబడి ఉంటాయి. ఇవి ఒక నిర్దిష్ట స్థాయిలో పాఠశాల అభివృద్ధికి మరియు ఉన్నత స్థాయి ఆశయానికి తోడ్పడతాయి. ఇవి క్రమానుగత వివరణ సూచికలు కావడం వలన, పాఠశాల నిమ్నస్థాయి అవసరాలను కూడా తీర్చగలుగుతాయి. ఉదాహరణకు ఒకపాఠశాల కీలక ప్రమాణాలు మూడవ స్థాయిలో ఉంటే, అది మొదటి మరియు రెండవ స్థాయి నిర్దేశిత కీలక ప్రమాణాలను సాధించినట్లవుతుంది.

ఉదాహరణకి ప్రధానక్షేత్రం-3 లోని ''విద్యార్థుల హాజరు'' అనే కీలక ప్రమాణానికి వివరణ సూచిక.

| **కీలక ప్రమాణం** | **వివరణ సూచిక** | | |
|---|---|---|---|
| | **స్థాయి-1** | **స్థాయి-2** | **స్థాయి-3** |
| విద్యార్థుల హాజరు | ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా విద్యార్థుల హాజరును తీసుకొని నమోదుచేయడం; తరుచుగా గైర్హాజరయ్యే మరియు | విద్యార్థుల హాజరు వివరాల సమాచారం తల్లిదండ్రులకు రెగ్యులర్‌గా (తరుచుగా) అందించడం; దీర్ఘకాల | విద్యార్థుల హాజరు సంఖ్యా వివరాలను విశ్లేషించడం; ఎక్కువ గైర్హాజరు రేటుకు ఏదైనా ప్రత్యేక వర్గానికి చెందిన |

| కీలక ప్రమాణం | వివరణ సూచిక | | |
|---|---|---|---|
| | స్థాయి–1 | స్థాయి–2 | స్థాయి–3 |
| | సమయపాలన పాటించని విద్యార్థులను గుర్తించడం; తరగతి వారీగా విద్యార్థుల హాజరు వివరాలను పాఠశాల నోటీసు బోర్డుపై ప్రదర్శించడం; తరుచుగా గైర్హాజరయ్యే విద్యార్థుల గురించి వారి తల్లిదండ్రులకు అప్పుడప్పుడు సమాచారాన్ని అందించడం. | అనుపస్థితిని మరియు తరుచు గైర్హాజరుకు కారణాలను, గుర్తించడం; అభ్యసనంపై తక్కువ హాజరు చూపే ప్రభావం గురించి విద్యార్థులు మరియు తల్లిదండ్రులతో చర్చించడం; అవసరమైన సందర్భాలలో విద్యార్థుల ఇంటిని సందర్శించడం. | విద్యార్థులకో లేక సంవత్సరంలో ఏదైనా సీజనుకి సంబంధం ఉన్నదా, అన్న విషయం నిర్ధారించుకోవడం. పాఠశాల యాజమాన్య కమిటి (ఎస్.ఎమ్.సి.) మరియు తల్లిదండ్రుల సహాయంతో సమస్యను నివారించడం; రెగ్యులర్ హాజరు మరియు సమయ పాలన పాటించడం గురించి విద్యార్థులు మరియు తల్లిదండ్రులను ప్రేరేపించే విధానాలను రూపొందించడం; రెగ్యులర్‌గా హాజరయ్యే మరియు సమయపాలన పాటించే విద్యార్థులను గుర్తించడం మరియు అభినందించడం. |

**పాఠశాల అభివృద్ధి**

5) **సాక్ష్యాధారాలు** : సాక్ష్యం పాఠశాలను ఏ స్థాయిలో ఉందో నిర్ణయించుటకు ఉపకరిస్తుంది. పాఠశాల ఒక స్థాయిలో ఉండుటకు కీలక ప్రమాణాలకు అనుగుణంగా సరియైన సాక్ష్యాధారాలతో సమర్థించుకోవాలి. కీలక ప్రమాణాలకు సూచించిన సాక్ష్యాధారాల జాబితా నుండి తగిన అంశాలను తీసుకొనుట ద్వారా పాఠశాల తన స్థాయిని సమర్థించుకోవచ్చు. జాబితాలోలేని అంశాలకు ప్రత్యామ్నాయ సాక్ష్యాధారాలను కూడా పాఠశాల చూపించవచ్చును. పాఠశాలలో అందుబాటులోనున్న వ్రాతపూర్వక పత్రాలు, ఫోటోలు, సాంఖ్యక దత్తాంశాలు, దృశ్య–శ్రవణ సామగ్రి మొదలైనవాటిని కూడా సాక్ష్యాధారాలుగా వాడుకోవచ్చు. పాఠశాల U-DISE రిపోర్టును కూడా సాక్ష్యాధారంగా చూపించవచ్చు. పాఠశాల యాజమాన్య కమిటీ సూచనలు, తల్లిదండ్రుల సూచనలు, విద్యార్థుల మాటలతో రికార్డు చేసిన తరగతి గది సన్నివేశాలు కూడా సాక్ష్యాధారాలుగా పరిగణించవచ్చు. సాక్ష్యాధారాలను క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

- నిర్దేశిత సాక్ష్యాధారాలు : ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు, రిజిష్టర్లు మొదలగునవి.
- సహాయక ఆధారాలు : పాఠశాలలో అందుబాటులో ఉన్న రికార్డులు.
- పాఠశాల రూపొందిచుకోవసిన సాక్ష్యాధారాలు.

ఉదాహరణకి ప్రధాన క్షేత్రం–5 కి సాక్ష్యాధారాలు :

- నిర్ధేశిత సాక్ష్యాధారాలు :
  - SSA Frame work for implementation. Chapter-IV (PP.77.79), Chapter-VII (PP.112-115)

    (http://mhrd.gov.in/sites/uplood_files.mhrd.files/upload_document/SSA-Frame-work.pdf) etc.
  - NCF-2005 (Chapter-V (PP.104-105)

    (http://www.ncert.nic.in/right side/links/pdf/framework/english/nf2005.pdf) etc.
- సహాయక ఆధారాలు :
  - Documented/written/displayed school vision/mission statement.
  - Minutes of the SMC meetings held. etc.
- పాఠశాల రూపొందించుకోవలసిన సాక్ష్యాధారాలు :
  - ప్రధానోపాధ్యాయుడు నమోదు చేయవలసిన తరగతి మరియు పాఠశాల పరిశీలనలు.
  - ఉపాధ్యాయుల పనితీరుపై అభిప్రాయాలను నమోదుచేయవలసిన రికార్డులు.

6) **ప్రతిస్పందన మాత్రిక** : ప్రతి ప్రధాన క్షేత్రానికి ఒక ప్రతిస్పందన మాత్రిక ఉంటుంది. ప్రతి కీలక ప్రమాణానికి ప్రతిస్పందన మాత్రికలను పాఠశాల ఉపయోగించాలి. వివరణ సూచికల ఆధారంగా తన భాగస్వాముల సమిష్ఠి నిర్ణయంతో పాఠశాల ప్రతిస్పందనలను రూపొందిస్తుంది. ప్రతి కీలక ప్రమాణానికి పాఠశాల ఒక స్థాయి (Level) ని మాత్రమే ఎంపిక చేసుకోవలసి ఉంటుంది.

ప్రతిస్పందన మాత్రిక అనేది, ప్రతి ప్రధాన క్షేత్రానికి పాఠశాల యొక్క ప్రస్తుత స్థాయి పూర్తి స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే పట్టిక. ఇటువంటి పదాల ప్రతిస్పందన మాత్రికలను ప్రతి ప్రధాన క్షేత్రానికి ఒకటి చొప్పున మూల్యాంకన ప్రక్రియ చివరలో పాఠశాల పూరించవలసి ఉంటుంది.

ఉదాహరణకి ప్రధాన క్షేత్రం–4కి సంబంధించిన ప్రతిస్పందన మాత్రిక.

| కీలక ప్రమాణం | స్థాయి–1 | స్థాయి–2 | స్థాయి–3 |
|---|---|---|---|
| నూతన ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ | | | |
| ఉపాధ్యాయుల యొక్క హాజరు | | | |
| బాధ్యతలను అప్పగించడం మరియు పనితీరు లక్ష్యాలను నిర్దేశించడం | | | |
| మారుతున్న విద్యాప్రమాణాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంసిద్ధత | | | |
| ఉపాధ్యాయుల పనితీరుపై పర్యవేక్షణ | | | |
| ఉపాధ్యాయుల వృత్తిపర అభివృద్ధి | | | |

7) **నవకల్పనలు** : ప్రతిక్షేత్రం పాఠశాలకు ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని చేసి నమోదు చేయడానికి అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ కార్యక్రమాలు కీలక ప్రమాణాలలోను, వాటి సూచికలలోనూ లేనివి అయితే అది ఆ పాఠశాల యొక్క ప్రత్యేకతను సూచిస్తుంది. నిర్దేశిత పాఠశాల ప్రమాణాలలో లేని నవకల్పనలను ఆ పాఠశాల నిర్వహిస్తున్నందుకు, ప్రశంసించవచ్చు.

8) **అభివృద్ధి ప్రణాళిక రూపొందించడం** : ప్రతిస్పందన మాత్రికలనుపయోగించి స్థాయి (1, 2 లేదా 3) ని పాఠశాల నిర్ధారించుకోవలసి ఉంటుంది. ఈ స్థాయిలను పెంపొందించుకోవడానికి అభివృద్ధి అవసరమైన అంశాలను పాఠశాల గుర్తించాలి. భాగస్వాములందరూ కలిసి సమిష్టిగా కొన్ని అంశాలను గుర్తించి ప్రాధాన్యంలేని అంశాలను వదిలివేయవచ్చు. గుర్తించిన అంశాలలో ప్రాధాన్యతా క్రమాన్ని (తక్కువ, మధ్యమ, ఎక్కువ) టిక్ (✓) ద్వారా ఎన్నుకోవాలి. తక్షణ అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాధాన్యతా క్రమం ఉంటుంది. ఈ క్రమాన్ని అనుసరించి దశల వారీగా ఆయా అంశాలను అభివృద్ధి చేసుకోవడానికి పాఠశాల ఒక ప్రాథమిక ప్రణాళికను తయారుచేసుకోవాలి. ఎంపిక చేసిన ప్రతి అంశానికి చేపట్టవలసిన చర్యలను రూపొందించుకోవాలి. కీలక ప్రమాణాలన్నింటికీ పాఠశాల ఒకేసారి చర్యలు తీసుకోవలసిన అవసరం లేదు. దీని కోసం 1, 2, 3 సం॥ లు (Y–1, Y–2 లేక Y–3) కి ఎదురుగా టిక్ (✓) చేసుకోవాలి. ఇది ప్రతిస్పందన మాత్రికలో ఎంపిక చేసుకున్న ఛాయిస్‌లపై ఆధారపడి ఉంటుంది.

ఉదాహరణకు ప్రధాన క్షేత్రం–6 కి సంబంధించిన అభివృద్ధి ప్రణాళిక :

| కీలక ప్రమాణం | స్థాయి | అభివృద్ధి అంశం | అభివృద్ధి అంశాలలో ప్రాధాన్యతా క్రమం | | | ప్రతిపాదిత చర్య | కాల పరిమితి (టిక్ (✓) చేయవలెను) | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | తక్కువ | మధ్యమ | ఎక్కువ | | Y–1 | Y–2 | Y–3 |
| సమ్మిళిత సంస్కృతి | | | | | | | | | |
| ప్రత్యేక అవసరాలుగల పిల్లల విలీనత | | | | | | | | | |
| భౌతికపరమైన భద్రత | | | | | | | | | |
| మానసిక భద్రత | | | | | | | | | |
| ఆరోగ్యం మరియు పరిశుభ్రత | | | | | | | | | |

## 2.6 ఆచరణాత్మక అభ్యాసము

కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ మరియు ఎన్.ఐ.ఇ.పి.ఎ. ఆధ్వర్యంలో నిర్వహించే శాలాసిద్ధి (ఎన్.పి.ఎస్.ఎస్.ఇ.)లో ఇచ్చిన పట్టికలనుపయోగించి పాఠశాల ప్రమాణాలను స్వీయ మూల్యాంకనం చేసి, మీ పాఠశాల స్థాయిని గుర్తించి, పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారుచేయండి.

## 2.7 ముగింపు

ఎన్.పి.ఎస్.ఎస్.ఇ. ప్రకారం పాఠశాలను స్వీయమూల్యాంకనం చేసుకొని, మూల్యాంకన నివేదికను విశ్లేషించి పాఠశాల ప్రమాణాలను అభివృద్ధి చేసుకోవడానికి భాగస్వాములందరి సహకారంతో సమిష్ఠిగా ప్రణాళికను తయారుచేసుకొని, అమలుపర్చాలి. తద్వారా పాఠశాల స్థాయి అంచెంచెలుగా ఎదుగగలదు.

స్వీయ మూల్యాంకన నివేదిక బాహ్య మూల్యాంకనానికి ఆధారంగా నిల్చి, పాఠశాల అభివృద్ధికి దోహదపడగలదు. అప్పుడే పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు ఇతర భాగస్వాములందరూ సమిష్ఠిగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో తమ పాత్రను పోషించినవారౌతారు.

## 2.8 సంప్రదింపు గ్రంథాలు

- శిలాసిద్ధి మాడ్యూల్

పాఠశాల ప్రమాణాలు మరియు మూల్యాంకన చట్రం (ఎన్.పి.ఎస్.ఎస్.ఇ.), ఎన్.ఐ.ఇ.పి.ఎ., న్యూఢిల్లీ.

## 2.9 మదింపు

**సరియైన జవాబును గుర్తించండి.**

1) పాఠశాల ప్రమాణాలను ఎన్ని ప్రధానక్షేత్రాలుగా గుర్తించడం జరిగింది? ( )

A) 4 B) 5 C) 7 D) 9

2) "పాఠశాల వనరుల సౌలభ్యత, అందుబాటు, తగుపరిమాణం, వినియోగం" అనే ప్రధాన క్షేత్రంలో ఎన్ని కీలక ప్రమాణాలున్నాయి? ( )

A) 12 B) 9 C) 6 D) 5

3) "తరగతి నిర్వహణ" అనే కీలక ప్రమాణం ఏ ప్రధాన క్షేత్రానికి చెందినది? ( )

A) ప్రధానక్షేత్రం-1 B) ప్రధానక్షేత్రం-2

C) ప్రధానక్షేత్రం-5 D) ప్రధానక్షేత్రం-7

4) పాఠశాల అభివృద్ధిలో వీరిది కీలకపాత్ర. ( )

A) విద్యార్థులు B) ఉపాధ్యాయులు

C) ప్రధానోపాధ్యాయులు D) తల్లిదండ్రులు

5) పాఠశాల స్వీయ మూల్యాంకనాన్ని ఎవరు చేస్తారు? ( )

A) జిల్లా విద్యాధికారులు B) మండల విద్యాధికారులు

C) పాఠశాల భాగస్వాములు D) స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు